ప్రజాశక్తి
గురువారం 6 ఫిబ్రవరి 2025
5
అనంతపురం



ప్రజాపోరాటాలను బలపరచండి

◆ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, లౌకికత్వ పరిరక్షణకు ఉద్యమాలు
◆ సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప
◆ సిపిఎం రాష్ట్ర మహాసభ తీర్మాణాల అమలుకు సన్నద్ధం



విలేకరులతో మాట్లాడుతున్న ఓ.నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, లౌకికతత్వ పరిరక్షణకు సిపిఎం నిర్వహిస్తున్న ప్రజా పోరాటాలను బలపరచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. బుధవారం గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.రామిరెడ్డి, ఎం.క్రిష్ణమూర్తిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 1, 2, 3వ తేదీల్లో నెల్లూరులో సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలు జరిగాయన్నారు. ఇందులో 472 మంది ప్రతినిధులు హాజరై చేసిన తీర్మానాల అమలుకు సిపిఎం అనంతపురం జిల్లా కమిటీ సన్నద్ధం అవుతోందన్నారు. ప్రజా సమస్యలపై 39 తీర్మానాలను మహాసభ ఆమోదించిందన్నారు. వాటి అమలు కోసం రాబోవు మూడు సంవత్సరాల్లో ప్రజా ఎజెండాతో రాజకీయ పోరాటం, మతసామరస్యం, దేశ సమైక్యత కాపాడాలని, ప్రజల ఆదాయాల పెంచి, భారాలు తగ్గించాలని పోరాడనున్నట్లు తెలిపారు. రాష్ట్ర అభివద్ధి అంటే ప్రజల జీవన ప్రమాణాల అభివద్ధి కావడం వారి కొనుగోలు శక్తి పెరగడం అన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కావాలని, ఉపాధి అవకాశాలు పెంచే విధానాలు రావాలన్నారు. పాలకుల దష్టిలో అభివద్ధి అంటే సంపన్నుల అభివద్ధి, కార్పొరేట్ కంపెనీల అభివద్ధి కోసం అన్నట్లు మారిందన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పి-4, క్లీన్ ఎనర్జీ లాంటి పాలసీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తూ ప్రజా అభివృద్ధిని గాలికొదిలేస్తోందన్నారు. 12 గంటల పని విధానం కావాలని కార్పొరేట్ కంపెనీల యజమానులు డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. భూ పంపిణీ చేయడం ద్వారా గ్రామీణ పేదల కొనుగోలు శక్తి పెరిగి రాష్ట్రం అభివద్ధి చెందుతుందన్నారు. వివిధ జిల్లాలలో అనేక సహజ వనరులు ఉన్నాయని, వాటి ఆధారంగా చిన్న మధ్య తరహా పరిశ్రమలు ప్రభుత్వ రంగంలో స్థాపించి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. విద్య వైద్య రంగాల్లో ప్రయివేటీకరణ ఉప సంహరించాలన్నారు. ఈ రంగాలను ప్రభుత్వాలు మెరుగు చేసి ప్రజలపై పడుతున్న భారాలు తగ్గించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విభజన చట్టం హామీలు ప్రత్యేకహోదా అమలు చేయాలన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలన్నారు. సొంత గనులు కేటాయించి, సెయిల్లో విలీనం చేయాలన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించాలన్నారు. పోలవరం, రాజధాని నిర్మాణాలకు కేంద్రం పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సమగ్ర పునరావాసం, న్యాయమైన పరిహారం ఇచ్చి, ప్రాజెక్టు పూర్తి చేయాలన్నారు. కేంద్ర విద్యాలయాల నిర్మాణానికి, నిర్వహణకు నిధులు ఇవ్వాలన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. సమగ్ర భూ పంపిణీ చేపట్టాలన్నారు. వివిధ తరగతులకు చెందిన సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.రామిరెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలు పెరుగుతున్నాయని, మౌలిక సదుపాయాలు సమస్యలపై ఉద్యమిస్తామన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కష్ణమూర్తి మాట్లాడుతూ వ్యవసాయాన్ని అభివద్ధి చేస్తే తప్ప గ్రామీణ ప్రాంతాల రైతులు, వ్యవసాయ కూలీలు, యువతకు ఉపాధి దొరకదన్నారు. నీటిపారుదల ప్రాజెక్టును పూర్తి చేసి ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలన్నారు. హంద్రీనీవా కాలవలను వెడల్పు చేసి ఆయకట్టుకు నీరు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీని పట్టణాలకు కూడా అమలు చేయాలన్నారు.



ఉద్యానవన సమ్మేళనంలో పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు, అధికారులు

ఫ్రూట్‌బౌల్ ఆఫ్ ఇండియాగా అనంత

◆ రైతు సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం
◆ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్
◆ అనంతలో 'ఉద్యానవన సమ్మేళనం'
◆ పాల్గొన్న వివిధ కంపెనీల ప్రతినిధులు
◆ 7 కంపెనీలతో ఎంఒయులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్



కాలవ శ్రీనివాసులు



పరిటాల సునీత



జెసి.ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం జిల్లాను 'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఎపి'గానే కాకుండా 'ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియా'గా మారుద్దామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాలులో 'అనంత ఉద్యానవన సమ్మెళనం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ తొలి ఉద్యానవన సమ్మెళనంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాపారవేత్తలు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యావన పంటల ఉత్పత్తులతో పాటు, మార్కెటింగ్ వరకు జరగాల్సిన ప్రక్రియపై చర్చించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో పండే కొన్ని రకాల ఉద్యానవన పంటలకు దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని చెప్పారు. దీన్ని మరింతగా విస్తరించాల్సిన అవసరముందన్నారు. అనంతపురం ఫ్రూట్ అంటనే ఒక బ్రాండ్‌ను రూపొందించాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఎపిగా పేరుందని, దీన్ని ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియాగా మార్చే విధంగా కృషి చేయాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. కంపెనీలతో రైతులను అనుసంధానం చేసి రైతుకు ప్రయోజనం జరిగే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు డ్రిప్ సౌకర్యాన్ని తీసుకొచ్చే సమయంలో ప్రతిపక్షాలు హేళన చేసాయని, కాని ఇప్పుడు అది ఎంతగానో విజయవంతమైందన్నారు. రాబోయే రోజుల్లోనూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని మరింతగా రైతుకు మేలు చేసే విధంగా చూడాలని ఆయన చూస్తున్నారన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి టిజి భరత్ ఆన్‌లైన్ ద్వారా ప్రసంగించారు. అంతకు మునుపు జిల్లా ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో అరటి, మామిడే కాకుండా బొప్పాయి, దానిమ్మ పంటల సాగు కూడా ఉందన్నారు. వీటన్నింటికి సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని సూచించారు. మాజీ మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ డ్రిప్ సౌకర్యం ఇప్పుడు ఐదు ఎకరాలకే ఉందని, దానిని పది ఎకరాలకు పెంచాలని కోరారు. టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలని గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం కోరారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి నుంచి ఇప్పుడు అరటి ఇతర దేశాలకు ఎగుమతి అవుతోందన్నారు. ఇలా ఎగుమతులు పెరగడం ద్వారానే రైతుకు మద్దతు ధర లభిస్తుందన్నారు.



ప్రతినిధులతో ఎంఓయులు చేసుకున్న పత్రాలను చూపుతున్న మంత్రి కేశవ్, కలెక్టర్ వినోద్‌కుమార్



రాజశేఖర్,వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి

ప్రతి ఏటా ఇటువంటి సమ్మేళం
రాజశేఖర్ వ్యవసాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి

పండ్ల ఉత్పత్తుల్లో అనంతపురం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని చెప్పారు. దేశం నుంచి ఎగుమతి అయ్యే అరటిలో అత్యధికం అనంతపురం జిల్లా నుంచే ఉంటోందన్నారు. పంట ఉత్పదన, అమ్మకం మధ్యనున్న నష్టాన్ని తగ్గించడం, ఎగుమతుల ద్వారా రైతుకు గిట్టుబాటు ధర అందే విధంగా చూడటం వంటి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. రైతులను మరింత తగా ప్రోత్సహించేందుకు ఇటు వంటి సమ్మెళనాలను ఏటా నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.



కలెక్టర్ వినోద్‌కుమార్

హార్టికల్చర్ హబ్ నుంచి హార్టికల్చర్ ఇంజన్‌గా మర్పు
కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతను హార్టికల్చర్ హబ్ నుంచి హార్టికల్చర్ ఇంజన్‌గా మార్పు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే అనంతపురం జిల్లా ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియా ఉందన్నారు జిల్లాలో ఉద్యానవన పంటల ద్వారా చేకూరుతున్న ఆదాయం రూ.16 వేల కోట్లు ఉంటోందన్నారు. ఇప్పుడున్న విలువను రాబోయే రోజుల్లో 25 శాతం పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. దీనికి అనుగుణమైన మార్పులు తీసుకొస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 25 లక్షల మెట్రిక్ టన్నులు ఉందన్నారు. దీన్ని రాబోయే రోజుల్లో 29 లక్షల మెట్రిక్ టన్నులకు తీసుకుపోవాలన్నది లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, యాజమాన్య పద్ధతుల, మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సురేంద్రబాబు, బండారు శ్రావణి, ఎపి హార్టీకల్చర్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఫుడ్ ప్రాసెసింగు సొసైటీ సిఇఒ శేఖర్ బాబు, తదితరు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు - 7 ఎంఒయులు

ఉద్యానవన సమ్మెళనంలో 13 స్టాళ్లు ఏర్పాటు చేయగా మంత్రి, ఎమ్మెల్యేలు వాటిని పరిశీలించారు. వాటి గురించి ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఎలైట్ బయో టెక్నాలజీస్, సీనాగ్రో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డిజిటల్ గ్రీన్, సంకల్ప్ రిటైల్ స్టోర్, రామ డ్రిప్ సిస్టమ్స్, కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, బాయర్ క్రాఫ్ సైన్స్ లిమిటెడ్, జిఎం పవర్ సిస్టమ్స్, ఎకో జెన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇఫ్కో, ఫసల్, మొబిటెక్ వైర్లెస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, నెట్ ఫిమ్ ఇరిగేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు వారి ఉత్పత్తులను స్టాల్స్ నందు ప్రదర్శించి, వాటి ఉపయోగాలను తెలియజేశారు. ఉద్యాన సమ్మేళనంలో 7 కంపెనీలు ఎంఒయులు కుదుర్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో కంపెనీలు, రైతులు 11 మంది అవార్డులు అందుకున్నారు.

8 నుంచి డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-గుంతకల్లు



ఉచిత శిక్షణ ప్రచార గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న సిఐ మనోహర్

కానిస్టేబుల్స్ మైన్స్ పరీక్ష, ఆర్ఆర్‌బి, గ్రూప్-డి పరీక్షలకు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 8వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు డివైఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సిఐ మనోహర్‌తో కలిసి ఉచిత శిక్షణ ప్రచార గోడ పత్రికలను విడుదల చేశారు. సిఐ మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిష్ణాతులైన అధ్యాపకుల చేత ఉచిత శిక్షణ ఏర్పాటు చేయడం హర్షణీయన్నారు. సురేంద్రబాబు మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ నుంచి సాయంత్రం 4 నుంచి 8గంటల వరకూ శిక్షణ తరగతులు నిర్వహిస్తారని, నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వీక్లీ ఓ టెస్ట్ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకీ, డివైఎఫ్ఐ నాయకులు రాజేష్, కన్నయ్య, రంగా, అంజి పాల్గొన్నారు.

'ట్రేడ్ లైసెన్స్ పేరుతో సైబర్ నేరగాళ్ల వల'

అప్రమత్తంగా ఉండాలి : కమిషనర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ట్రేడ్ లైసెన్స్‌ను తక్షణమే చెల్లించాలని కొందరు సైబర్ నేరగాళ్లు వ్యాపారులకు ఫోన్ చేసి ఫేక్ ఐడిలు పంపుతున్నారని, అలాంటివి నమ్మవద్దని కమిషనర్ వి.మల్లికార్జునరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. ఇటీవల కాలంలో అపరిచిత వ్యక్తులు తాము మున్సిపల్ కమిషనర్ అని, కార్పొరేషన్ అధికారుల మని 63009 05117, 79807 50650 నంబర్ల నుంచి ఫోన్ కాల్స్ చేసి, వివిధ వాణిజ్య వ్యాపారుల నుంచి ట్రేడ్ లైసెన్స్ ఫీజు తక్షణమే చెల్లించాలని ఫేక్ అకౌంట్ నంబర్లు, ఫోన్ పే ద్వారా చెల్లించాలని తప్పుడు సమాచారం ఇస్తున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇలాంటి ఫేక్ కాల్స్ పునరావృతం వస్తూ ఉంటే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా అనంతపురం నగరపాలక సంస్థ కంట్రోల్ రూమ్ నెంబర్లు 08554-230234, 08554-274765కు ఫిర్యాదు చేయాలన్నారు.

సేవాలాల్ జయంతి వేడుకలకు రూ.50 లక్షలు మంజూరు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లాలో వెలసిన బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఫిబ్రవరి 14, 15 తేదీల్లో నిర్వహణకు టిడిపి కూటమి ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సహకార సంస్థ డైరెక్టర్ రమావత్ రమేష్ నాయక్ తెలిపారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన మొదటి సంవత్సరంలోనే ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ సేవాలాల్ జయంతి ఉత్సవాలకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఎస్టీలపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిధుల విడుదల నిదర్శనం అన్నారు. గత వైఎస్ఆర్ ప్రభుత్వం 2019- 2024 వరకు ఒక పైసా కూడా నిధులు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్టీ సెల్ అనంతపురం పార్లమెంట్ కార్యదర్శి రాజేష్ నాయక్, అనంతపురం నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు మనోహర్, శ్రీనివాస నాయక్, సురేష్ నాయక్, రవి నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీ ఫార్మసీ, ఫార్మా డీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురము జెఎన్‌టియు ఒటిపిఆర్ఐ కళాశాలలో బి ఫార్మసీ, ఫార్మా డీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జెఎన్‌టియు అడ్మిషన్ డైరెక్టర్ ఎ.సురేష్ బాబు బుధవారం తెలిపారు. కన్వీనర్ కోట సీట్లలో మిగిలిన సీట్లకు సంబంధించి ఈ నెల 6,7వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏపీఇఏపి(బైపిసి)-2024లో అర్హత, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు ఇందుకు అర్హులన్నారు. ఇంతవరకు ఎక్కడా అడ్మిషన్ తీసుకోని వారు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యమండలి ఆమోదించిన అడ్మిషన్స్ మాత్రమే పరిగణంలోకి వస్తాయన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో గురు, శుక్రవారాల్లో ఉదయం 10గంటల నుంచి 11గంటల లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అడ్మిషన్లు అనంతపురం జెఎన్‌టియు డా॥ ఎపిజె అబ్దుల్ కలాం అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, అడ్మిషన్స్ ఆఫీస్ వద్ద జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు www.jntua.ac.in వెబ్ సైట్లో చూడాలన్నారు.

సిసి రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల కేంద్రంలోని బిందెల కాలనీలో సిసి రోడ్లను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా మండలంలో సిసి రోడ్లు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, మండలం ఇన్‌ఛార్జి శ్రీరామ్ రెడ్డి, టిఇపి మండల కన్వీనర్ అశోక్ కుమార్, ఎస్.నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, రవీంద్ర, కేశన్న, ఓబుళపతి, పసలూరు రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ పుణ్యవతి, ఎంపీడీవో సాల్మన్ రాజ్ ఇఒఆర్‌డి సదాశివ, పంచాయతీరాజ్ ఇంజినీర్ మద్దిలేటి, హౌసింగ్ ఇంజినీర్ ఆదిమూర్తి, పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఇళ్ల బకాయి బిల్లులు ఇప్పించండి

2014-2019 మధ్య కాలంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణం పథకం కింద నిర్మించిన పక్కా ఇళ్ల లబ్ధిదారులకు బకాయి బిల్లులు చెల్లించాలని టీడీపీ జిల్లా నాయకులు పి.తూముచెర్ల బాబా ఫక్రుద్దీన్ వలీ ఎమ్మెల్యే శ్రావణిశ్రీకి వినతిపత్రం అందజేశారు.



సిసి రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి



అనంతపురం టవర్‌క్లాక్ వద్ద లేబర్ కోడ్స్, కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సిఐటియు, రైతుసంఘం నాయకులు

కార్పొరేట్ల కోసమే మోడీ తపన

◆ లేబర్ కోడ్స్‌తో కార్మికుల హక్కులు హననం ◆ ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్
◆ సిఐటియు, రైతుసంఘం ఆధ్వర్యంలో లేబర్‌కోడ్స్, బడ్జెట్ ప్రతులు దహనం

"దేశంలో నరేంద్ర మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి నేటి వరకు ప్రజా, కార్మిక, రైతు సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్లకు మేలు చేసేందుకే అనునిత్యం తపన పడుతున్నారు. కార్మిక, రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారు. ప్రస్తుత బడ్జెట్‌లో కూడా ఎక్కడా వీరి సంక్షేమం గురించి ప్రస్తావన లేదు. కార్మిక, రైతు వ్యతిరేక పాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలి'. అని సిఐటియు, రైతుసంఘం నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. కార్మిక చట్టాల రద్దు.. లేబర్ కోడ్స్ అమలు, బడ్జెట్‌లో కార్మిక, రైతు, ప్రజలకు నిధులు కేటాయించకపోవడంపై జిల్లా వ్యాప్తంగా సిఐటియు, రైతు సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. లేబర్ కోడ్స్, బడ్జెట్ ప్రతులను దహనం చేశారు.

వార్త 6లో

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్



వినతిపత్రం అందజేస్తున్న రైతు, పండ్లతోటల సంఘం నాయకులు

జిల్లాలో పండ్ల తోటల రైతులను ఆదుకునేలా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు, కోల్డ్ స్టోరేజ్‌లు అన్ని మండలాల్లో ఏర్పాటు చేయాలని, సబ్సిడీలు ఇవ్వాలని, డ్రిప్పు స్పింక్లర్లపై జిఎస్‌టి రద్దు చేయాలని ఏపి రైతు సంఘం, పండ్ల తోట రైతు సంఘం నేతలు కోరారు. ఈ మేరకు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, పండ్ల తోటల రైతుసంఘం నాయకులు శివారెడ్డి, బిహెచ్.రాయుడులు అనంత ఉద్యానవన సమ్మెళనంలో ఫుడ్ ప్రాసెసింగ్ చీఫ్ సెక్రటరీ శేఖర్ బాబు, కలెక్టర్ వి.వినోద్ కుమార్‌లను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం చీనీ మార్కెట్ యార్డులో ఈనామ్ వ్యవస్థ రద్దు చేయాలన్నారు. మార్కెట్ నిబంధనల ప్రకారం 4 శాతం కమీషన్ వసూలు చేయాలన్నారు. కడప జిల్లా పులివెందుల మార్కెట్ యార్డ్‌లో చీనీ పంటను రైతుల సమక్షంలో వేలం పాట ద్వారా ధరను నిర్ణయించి వేలం అయిన వెంటనే రైతులకు నగదు చెల్లింపులు జరుగుతున్నాయని ఆ పద్ధతినే అనంతపురం చీనీ మార్కెట్ యార్డ్‌లో అమలు చేయాలన్నారు. చీనీ తోటలలో సూట్ తీసుకునే విధానం అరికట్టి, సూట్ తీసుకునే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. పెరుగుతున్న పండ్లతోటలకు అనుగుణంగా షెడ్లు నిర్మాణం, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలి. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు చెన్నారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, లక్కప్ప, బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-అనంతపురం



సీజనల్ వ్యాధులపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిఎంఅండ్‌హెచ్ఒ

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాల్సిన బాధ్యత మలేరియా సబ్ యూనిట్ అధికారులదేనని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భ్రమరాంబికాదేవి ఆదేశించారు. నగరంలోని డిఎంహెచ్ఒ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష, సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో తరచూ ఫీవర్ సర్వే నిర్వహించాలన్నారు. జిల్లా మలేరియా నివారణ అధికారి డి.ఓబుల్ మాట్లాడుతూ సబ్ యూనిట్ అధికారులు వారి పరిధిలోని పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలను సందర్శించి ల్యాబ్‌లు, రికార్డులను పరిశీలించాలన్నారు. సమావే శంలో ఎఎంఒ లక్ష్మీనాయక్, ఎంపిహెచ్ఒలు జి.గిరిధర్‌రెడ్డి, బత్తుల కోదండరామిరెడ్డి, శ్రీనివా సులు, రామకృష్ణ, శివయ్య, తిరుపాలయ్య, షమీవుల్లా, దేవలాల్‌నాయక్, నాగేంద్రకుమార్, మద్దయ్య, రమేష్, మునాఫ్, జయరామ్‌నాయక్, హెల్త్ సూపర్వైజర్లు నూరుబాషా, శ్రీధర్, లోకేశ్వర్‌రెడ్డి, రమేష్, మహబూబ్‌బాషా, బి.శశిధర్, తదితరులు పాల్గొన్నారు. మెదడు వాపు వ్యాధి నివారణ, నియంత్రణ చర్యలపై మున్సిపల్ అధికారులు, సబ్ యూనిట్ అధికారులతో డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబీదేవి సమీక్ష నిర్వహించి పలు సూచనలుచేశారు. డా॥యుగంధర్ ఆధ్వర్యంలో 'సమగ్ర వ్యాధి నిరోధక టీకా'లుపై పిహెచ్‌సి వైద్యాధికారులు, అర్బన్, పిపి యూనిట్ అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

కార్పొరేట్ల కోసమే మోడీ తపన



కళ్యాణదుర్గంలో ఆర్డీవో కార్యాలయ ఇన్‌ఛార్జి ఏవో ప్రవీణ్‌కుమార్‌కి వినతిపత్రం సిఐటియు నాయకులు, కార్మికులు ఇస్తున్న



పుట్లూరులో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న రైతు సంఘం, సిఐటియు నాయకులు

లేబర్ కోడ్స్‌తో కార్మికుల హక్కులు హననం
ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక బడ్జెట్
సిఐటియు ఆధ్వర్యంలో లేబర్‌కోడ్స్, బడ్జెట్ ప్రతులు దహనం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రధాని నరేంద్ర మోడీ గత 11 సంవత్సరాలుగా రైతులు, కార్మికులు, ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి కార్పొరేట్ల పాలనలో తరిస్తున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ విమర్శించారు. కార్మిక చట్టాల రద్దు, లేబర్ కోడ్స్ అమలు, బడ్జెట్‌లో కార్మిక, రైతు, ప్రజలకు నిధులు కేటాయించకపోవడంపై జిల్లా వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. లేబర్ కోడ్స్, బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. అనంతపురం టవర్‌క్లాక్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో ఈ సారి కూడా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన చట్టం హామీలు అమలు చేయాల్సి ఉన్నా కేంద్రం దాని ఊసెత్తలేదన్నారు. రాష్ట్రానికి నిధులు ఇవ్వకున్నా కూటమిలోని టిడిపి, జనసేన నాయకులు మోడీ ప్రశ్నించకుండా కితాబు ఇవ్వడం అత్యంత దుర్మార్గం అన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ లేబర్ కోడ్స్‌ను కేంద్రం తీసుకొస్తోందన్నారు. లేబర్ కోడ్స్ అమలు చేయడం అంటే కార్మికుల హక్కులను హరించడమే అన్నారు. సరళీకరణ విధానాల అమలు చేస్తూ, పెట్టుబడిదారులకు మేలు చేసేందుకు కార్మిక చట్టాలను రద్దు చేస్తున్నారని మండిపడ్డారు. హక్కులను కాలరాస్తే కార్మికవర్గం చూస్తూ ఊరుకోదని, ఐక్యంగా ప్రతిఘటిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంట్ యూనియన్ రాష్ట్ర నాయకులు మనోహర్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సురేంద్ర, శ్రీనివాసరావు, భగత్ సింగ్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, భాస్కర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగభూషణం, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రిస్వామి, తిరుమలేశు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నగర కార్యదర్శి రేవతి, సంధ్య హమాలీ యూనియన్ నాయకులు సాంబశివ, సుధాకర్ పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలో రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపి కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి రెడ్డిపల్లి శ్రీనివాసులు, మండల అధ్యక్షులు వెంకట కొండ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రైతులకు కేటాయింపులు శూన్యం అన్నారు. వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి ప్యాకేజీ లేదన్నారు. బిజెపి ప్రభుత్వం రాష్ట్రాన్ని అడుగడుగునా దగా చేస్తోందన్నారు. ఇప్పటికైనా టిడిపి, జనసేన పార్టీలు ఈ అన్యాయాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వేణుగోపాల్, క్రాంతి రెడ్డి, హనుమంతు, జయరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : కేంద్ర బడ్జెట్‌లో ఎపికి అన్యాయం చేశారని పేర్కొంటూ శింగనమలలో ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మరోమారు ఎపికి మొండి చేయి చూపించిందన్నారు. ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్యాకేజీ, విభజన హామీలను పక్కన పెట్టిందన్నారు. ఏ జాతీయ విద్యాసంస్థకు కేటాయింపులు చేయలేదన్నారు. విశాఖ రైల్వే జోన్, ఎన్ఐటి, ఐఐటి, ఐఐఎం, ట్రిపుల్ ఐటి, ఐఐఎస్ ఈఆర్, గిరిజన, సెంట్రల్ యూనివర్సిటీలు, దుగరాజపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్, వైజాగ్ మెట్రో, ఎయిమ్స్, వెనుకబడిన జిల్లాల నిధులు, రాజధాని నిర్మాణానికి నిధుల ఊసేలేదన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాలను గత బడ్జెట్ లోనే వెనుకబడిన ప్రాంతాలుగా గుర్తించినా ఒక్కపైసా ఇవ్వలేదన్నారు. ఎపికి జరిగిన అన్యాయం పై సిఎం చంద్రబాబు స్పందించాలని, అన్ని పార్టీల ఎంపిలు కేంద్రాన్ని నిలదీయాలన్నారు. దగాకోరు బడ్జెట్‌ను రాష్ట్ర ప్రజలు వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సుంకన్న, శ్రీనివాసులు, నాగేంద్ర, లక్ష్మీనారాయణ, సూర్యప్రకాష్, ఆంజనేయులు, రామాంజనేయులు, మునెప్ప, కేశన్న, వెంకటరాముడు, నల్లప్ప, పెద్దకేశన్న తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట దహనం చేశారు. రైతు, కౌలు సంఘం నాయకులు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ రైతాంగం అభివృద్ధికి ఏమాత్రం ప్రయోజనకరంగా లేదని, తీవ్రంగా నిరాశపరిచిందన్నారు. వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసేందుకే కేంద్రం రైతాంగ వ్యతిరేక విధానాలు అనుసరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, జిల్లా నాయకులు వెంకటేశులు, రైతు సంఘం నాయకులు రామాంజనేయులునాయక్, శీనప్ప, మురళి, వీరాంజనేయులు, సిద్ధప్ప, వినోద్, వెంకటేశులు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

పుట్లూరు : కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా, రైతులు, పేదలకు వ్యతిరేకంగా ఉందని, దీనిని ఖండిస్తూ రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో పుట్లూరు, కడవకల్లులో బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, మండల కార్యదర్శి టి.పెద్దయ్య, రైతు సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, జె.పెద్దయ్య, నాగభూషణం, కుళ్లాయప్ప, రైతులు, కూలీలు, కార్మికులు పాల్గొన్నారు.

రాప్తాడు : కేంద్ర బడ్జెట్‌లో ఎపి ప్రజల ఆశలను అడియాశలు చేసిందని సిపిఎం మండల నాయకుడు పోతలయ్య మండిపడ్డారు. మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన ద్రోహానికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో రాప్తాడులో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్‌రెడ్డి, గొర్ల నారాయణ, రామచంద్రారెడ్డి, రైతు సంఘం, సిపిఎం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం సమీపంలో సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. సిఐటి నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసింద న్నారు. ఈ విషయంపై సిఎం చంద్రబాబు కేంద్రాన్ని ప్రశ్నించకపోవడం దురదృష్టకరమ న్నారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్‌లకు ఉపయోగపడుతుందే కానీ సామాన్యులు, రైతులకు ఉపయోగం లేదన్నారు. కార్యక్రమంలో గోవిందు, శ్రీనివాసులు, హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు

పెద్దవడుగూరు : సిపిఎం పెద్దవడుగూరు మండల కమిటీ, క్రిష్టిపాడు శాఖా కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈశ్వర్‌రెడ్డి, యాదవ్, క్రిష్టిపాడు మద్దిలేటి, వ్యకాసం అధ్యక్షులు కృష్ణ, నారాయణ, సిఐటియు నాయకులు వీరాంజనేయులు, పెద్దన్న, ఎర్రన్న, ఆటో యూనియన్ నాయకులు శేఖర్, అల్లావలి, తదితరులు పాల్గొన్నారు

కళ్యాణదుర్గం రూరల్ : కార్మిక హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి ఆర్డీవో కార్యాలయ ఇన్‌ఛార్జి ఏవో ప్రవీణ్‌కుమార్‌కి వినతిపత్రం అందజేశారు. సిఐటియూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్స్‌గా తీసుకొచ్చిందని, ఇవి అమలు జరిగితే కార్మికులు వేతనాలు, వృత్తి, ఆరోగ్య, సామాజిక భద్రతను కోల్పోతారన్నారు. కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేయడం తప్ప కార్మికులకు ఎలాంటి భద్రత ఉండదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, శ్రీరామి రెడ్డి సత్యసాయి కార్మికులు, సివిల్ సప్లై హమాలీ యూనియన్ నాయకులు వన్నూరప్ప, తిమ్మప్ప, నటరాజ్, వన్నూరుస్వామి, తిప్పేస్వామి, రామచంద్ర, శివకుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

గుత్తి : కార్మిక చట్టాలు, హక్కులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న మోడీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుదామని సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఎస్.రాజా, పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు కె.సూర్యనారాయణ పిలుపునిచ్చారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ నూతన చట్టాలు కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని, వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. లేబర్ కోడ్‌ను రద్దు చేయని పక్షంలో మోడీ ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ లలితకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు బి.రామకృష్ణ, వ్యకాసం మండల అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి, వెంకటలక్ష్మి, రేవతి, కవిత, సిఐటియు నాయకులు సాధిక్, బాబా, మహేష్ పాల్గొన్నారు.

గుంతకల్లు : కేంద్రం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ అధ్యక్షులు జగదీష్ ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట రాస్తారోకో చేపట్టారు. సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు, మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకులు కె.నరసయ్య మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేయడం కోసమే కేంద్రం ఈ లేబర్ కోడ్స్‌ని అమలు చేయాలని చూస్తుందన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే ఏ ప్రభుత్వమైనా మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బాషా, రంగనాయకులు, తిరుపాల్, ప్రేమ్‌కుమార్, రవి, రాజేష్, రంగమ్మ, శంకరమ్మ, అంజనమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో డిప్యూటీ తహశీల్దార్ లలితకు వినతి పత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు



గుంతకల్లులో ర్యాలీ చేపట్టిన సిఐటియు నాయకులు, కార్మికులు

'కార్మికుల యూనియన్ విచ్ఛిన్నానికి కుట్ర' : సిఐటియు

ప్రజాశక్తి-తాడిపత్రి

మున్సిపల్ కార్మికుల యూనియన్‌ను విచ్ఛిన్నం చేయడానికి కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నారని సిఐటియు నాయకులు నరసింహ, జగన్, ఉమాగౌడ్ విమర్శించారు. కమిషనర్, ఇంజినీరింగ్ అధికారుల చర్యలను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన నిరసనలో భాగంగా మూడో రోజైన బుధవారం ఇంజినీరింగ్ సెక్షన్, వాటర్ సప్లై మస్టర్ పాయింట్ వద్ద సిఐటియు నాయకులు, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ యూనియన్‌లో చురుగ్గా వ్యవహరించే రామాంజనేయులు, జుబేర్‌పై వివక్ష చూపుతున్నార న్నారు. కార్మికుల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి చొరవ తీసుకొని మున్సిపల్ కార్మికులపై అధికారుల వేధింపులను ఆపాలని కోరారు. కార్మికులను ఎవరి విధుల్లో వారినే కొనసాగించాలని లేనిచో జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ కార్మికులతో కలిసి 'చలో తాడిపత్రి'కి పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



తాడిపత్రిలో అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్నా సిఐటియు నాయకులు, కార్మికులు

కార్మికులపై వేధింపులు ఆపాలి

అనంతపురం కార్పొరేషన్ : తాడిపత్రిలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులపై కమిషనర్ వేధింపులు ఆపాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగభూషణం డిమాండ్ చేశారు. తాడిపత్రి మున్సిపల్ కార్మికులకు సంఘీ భావంగా నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ సర్కిళ్లలో మస్టర్ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. నాగభూషణం మాట్లాడుతూ రామాంజనేయులు, జుబేర్ మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఆందోళనలు చేస్తున్నారనే నెపంతో వారి విధులను మార్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కమిషనర్ కార్మికులపై వేధింపులు ఆపాలని, వారిని యధావిధిగా విధుల్లో కొనసాగించాలని లేనిచో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి ముర్తూజ, మున్సిపల్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రిస్వామి, తిరుమలేష్, శేషేంద్రకుమార్, రవికుమార్, కార్మికులు పాల్గొన్నారు.

లక్ష్యం ఉన్నతంగా ఉండాలి

ప్రజాశక్తి-అనంతపురం

లక్ష్యం ఉన్నతంగా ఉన్నప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని భవిష్యత్ ఫౌండేషన్ సిఇఒ గుంటూరు విజయ్‌కృష్ణ తెలిపారు. నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటిఐలో బుధవారం ఉదయం నిర్వహించిన 'స్కిల్ హవర్' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. చదువుతున్న వయసు నుంచే ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని చేరుకునే దిశలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఛేదిస్తూ ముందుకు సాగాలన్నారు. ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ రామాంజనేయులు కెరీర్, గైడెన్స్, వర్క్ ప్లేస్ ఎథిక్స్ అంశాలపై విదార్థులకు విలువైన సమాచారం అందించారు. పిన్సిపల్ రామ్మూర్తి మాట్లాడుతూ విద్యా ర్థుల అభ్యున్నతి కోసం వివిధ రంగాల్లో నిష్ణాతులను ఆహ్వానించి పాఠాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బాలికల ఐటిఐ ప్రిన్సిపల్ ఆనందకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కృష్ణ

వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

వాల్మీకి, బోయ సామాజిక వర్గం ప్రజలను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైసిపి నాయకులు, జిల్లా ఖో-ఖో కమిటీ అధ్యక్షులు వై.భీమరెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నియోజకవర్గ బోయ యువ సంఘం నాయకులు బుధవారం కొనకొండ్ల గ్రామంలోని ఆయన నివాసంలో భీమరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. వై.భీమరెడ్డి మాట్లాడుతూ వైసిపి హయాంలో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శామ్యూల్ ఆనంద్ నేతృత్వంలో 'ఏకసభ్య కమిషన్' రాయలసీమలో విస్తృతంగా పర్యటించి బోయల జీవన ప్రమాణాలు, ఆర్థిక స్థితి గతులపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి ప్రభుత్వానికి, ఎస్టీ కమిషన్‌కు నివేదికలు సమర్పించిం దన్నారు. ఆ నివేదిక ఆధారంగా వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ ప్రభుత్వం తీర్మానం చేసి పంపి చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్టు ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే కేంద్రంతో సంప్రదించి బోయ, వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్పించాలని డిమాండ్ చేశారు.

సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే ధ్యేయం

ప్రజాశక్తి-ఉరవకొండ

చిన్నారులతో పాటు గర్భిణులు, పిల్లల తల్లులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే అంగన్వాడీ సెంటర్ల ధ్యేయమని సర్పంచి గీతమ్మ, సిడిపిఒ శ్రీదేవి తెలిపారు. విడపనకల్లు మండలంలోని హావళిగి గ్రామంలో బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 'సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం, బాల్య వివాహాల నివారణ' అంశాలపై అవగా హన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. నిర్దేశించిన సిలబస్ ప్రకారం ప్రీ స్కూల్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించి బాల్యవివాహాలను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాస కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్ర మంలో ఎసిడిపిఒ ఎల్లమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయకుమారి, హెచ్ఎం నారాయణ స్వామి, అంగన్వాడీ వర్కర్లు అంబిక, ఎం.నాగవేణి, శశికళ, రమాదేవి, బి.నాగవేణి, రుద్రమణి, సుమతి పాల్గొన్నారు.



అన్నప్రాస చేస్తున్న సిడిపిఒ శ్రీదేవి, సర్పంచి గీతమ్మ

శోధనపల్లిలో కంది కొనుగోలు కేంద్రం

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని హెచ్.శోధనపల్లి రైతు సేవా కేంద్రంలో బుధవారం కంది కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఏవో చెన్నవీరస్వామి తెలిపారు. క్వింటా రూ. 7,550 ధరతో ఎపి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో తుంపెర ఆంజనేయస్వామి సహకార సంఘం వారు కొనుగోలు చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

తాగునీటి సమస్యకు త్వరలో పరిష్కారం

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని నాగులగుడ్డం తండా గ్రామంలో మిట్ట ప్రాంతానికి త్వరలో తాగునీరు అందిస్తామని ఎంపీడీవో భాస్కర్ తెలిపారు. తాగునీటి సమస్యపై అందిన వినతుల మేరకు ఎంపీడీవో, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, పంచాయతీ సెక్రటరీ, ఇంజినీర్ అసిస్టెంట్ గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. బోరు మోటారు, పైపులైన్ కోసం రూ. 5 లక్షలు మంజూరయ్యా యని, వాటితో తండాలోని మిట్ట ప్రాంతానికి త్వరలోనే తాగునీరు అందిస్తామని అధికారులు తెలిపారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

ప్రజాశక్తి-ఉరవకొండ

మండలంలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ సమిష్టిగా కృషి చేద్దామని ఆరోగ్య విద్యా బోధకుడు వేణుగోపాల్ సూచించారు. విడపనకల్లు మండలంలోని గడేకల్ ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలన, జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్న వయసులో వివాహం చేయడం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. చట్టాలు, శిక్షల గురించి తెలిపారు. బాలికల విద్యను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, ఆరోగ్య విస్తరణ అధికారి తిరుపాల్ నాయక్, సిహెచ్ఒ పరిజాన, సుగుణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డప్పు అందజేత

ప్రజాశక్తి-ఉరవకొండ

మానవ హక్కుల నేత చాబాల లాలూసాబ్ బుధవారం ఎంఆర్‌పిఎస్ నాయకులు బెంజిమెన్‌కు వజ్రకరూరులో అంబేద్కర్ విగ్రహం ముందు డప్పును అందజేశారు. కార్యక్రమంలో చాబాల గ్రామసర్పంచి జగదీశ్, విశ్రాంత ఉద్యోగి, నేతాజీ అవార్డు గ్రహీత హాజీ పట్టా ఖాజాపీరా, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఆర్ఐటి' విద్యార్థులకు ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు

ప్రజాశక్తి-శింగనమల

బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురం గ్రామం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎస్ఆర్ఐటి) ఇంజినీరింగ్ కళాశాలలో 2024-25 క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా 8 మంది విద్యార్థులు ఏడాదికి రూ. 3.6 లక్షల ప్యాకేజీ ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలు పొందారని కరస్పాండెంట్ ఆలూరు సాంబశివరెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను డాక్టర్ ఎం.రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్. జి.బాలకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

'ఉపాధి' కూలీలను పెంచాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలో ఉపాధి హామీలో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపిడిఒ విజయ భాస్కర్ ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీర్ విభాగం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలో ఏటా 3వేల నుంచి 5వేల మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఆ ప్రణాళిక ప్రకారం గ్రామాల్లో కూలీల శాతాన్ని పెంచాలని, వారికి తగిన పని కల్పించాలని, బకాయిలు చెల్లించాలన్నారు. సీసీ రోడ్లు, సైడ్ వాల్, మట్టి వేయడం, గ్రామాల్లో పొలాలకు వెళ్లే దారులకు మరమ్మతులు చేయడం, ఫారం పాండ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఉపాధి హామీ మేట్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ విజయభాస్కర్

పుట్లూరు : అన్ని గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎపిఒ నరేంద్ర సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాల యంలో నిర్వహించిన సమావేశంలో ఎపిఒ మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో ఉపాధి పనులు కల్పించాలని, మినీ గోకులాలను త్వరగా పూర్తి చేయించాలని, ఇంకుడు గుంతలు తీయించాలని, అమృత సరోవరం పనులు చేయించాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ, టిఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు

ప్రసాద్‌కు ఫిల్మ్ సొసైటీ సత్కారం

ప్రజాశక్తి-నార్పల

రిటైర్డ్ కండక్టర్, సామాజిక సేవా కార్యకర్త నార్పల కెఎల్ఎన్.ప్రసాద్ ఇటీవల జరిగిన అనంతపురం ఫిల్మ్ ఫెస్టివల్ వేడుకల్లో ప్రముఖ ఫిల్మ్ మేకర్, దర్శకులు, అనంత ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు రషీద్‌బాషా, తెలుగు వెలుగు అధ్యక్షులు టివి రెడ్డి నుంచి జ్ఞాపిక అందుకున్నారు. ప్రసాద్ అనంతపురం ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన స్క్రిప్ట్ రైటింగ్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మహిళలు ఎదుర్కొంటున్న 'వాష్ రూమ్' (మరుగుదొడ్డి) సమస్యను కథ రూపంలో వివరించారు. రషీద్‌బాషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఏదో ఒక కళ దాగి ఉంటుందని, ఉత్తమ శిక్షణ పొంది నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. తద్వారా సమాజాన్ని ప్రభావితం చేసే మంచి లఘుచిత్రాలు ఇవ్వాలని కోరారు. ప్రసాద్ మాట్లాడుతూ రచయితలు, కళాకారులను ప్రోత్సహిస్తున్న రషీద్‌బాషా, టివి రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రసాద్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న నిర్వాహకులు

స్టెమి చికిత్స గుండెకు భరోసా

ప్రజాశక్తి-పామిడి

ప్రజలు స్టెమి గుండె చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని ఆసుపత్రి ప్రధాన వైద్యుడు డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం 'స్టెమి చికిత్స గుండెకు భరోసా'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా వయసుతో సంబంధం లేకుండా హార్ట్ అటాక్ సంభవిస్తుందన్నారు. గుండె జబ్బుల మరణాలను నివారించేందుకు స్టెమి చికిత్స భరోసా కలిగిస్తుందన్నారు. ఛాతీలో నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆయాసంగా ఉండడం, గుండెదడ, స్పృహకోల్పోవడం, తదిత లక్షణాలు ఉంటే వెంటనే అప్రమత్తం కావాలన్నారు. అవి ప్రారంభమైన మొదటి గంటలోపు ఆసుపత్రికి వస్తే వారికి పరీక్షలు నిర్వహించి రూ. 45వేల విలువ చేసే ఇంజెక్షన్ ఉచితంగా ఇస్తారన్నారు. కార్యక్రమంలో హెడ్ నర్స్ శివ కుమారి, ఎద్దులపల్లి పిహెచ్‌సి ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను బుధవారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి సందర్శించారు. వారు స్టేషన్ రికార్డులను పరిశీలించి, కేసుల గురించి ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వం గీత కార్మికుల కులాలకు కేటాయించిన మద్యం షాపులపై గీత కులాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గౌడ కులానికి ఒకటి, గౌండ్ల కులానికి ఒకటి కేటాయించినట్లు తెలిపారు. సమావేశంలో స్థానిక ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ మహేష్ కుమార్, ఎక్సైజ్ సిబ్బంది, ఈడిగ సామాజిక వర్గానికి చెందిన వారు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని జ్ఞానభారతీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు బుధవారం పశు సంవర్ధక శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. పశు సంవర్ధక శాఖ ఎడిఎ డాక్టర్ ఎన్.శ్రీనివాసగుప్తా విద్యార్థులకు పశు సంవర్ధక శాఖకు సంబంధించిన వివిధ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. బెళుగుప్ప పశువైద్యాధికారి డాక్టర్ ఎ.రమేష్ వివిధ పశు జాతులు, ఉత్పత్తులు(పాలు, మాంసం, గుడ్లు), మేత, దాణా, పునరుత్పత్తి, తదితర అంశాపై అవగాహన కల్పించారు. డాక్టర్ సురేంద్ర పశు వైద్య సంచార వాహనాల సేవలు, కరువులో ప్రత్యామ్నాయ మేతల తయారీపై అవగాహన కల్పించారు. కెవికె డాక్టర్ హరిణి జీవాలు, కోళ్ల పెంపకం, వివిధ రకాల మేత, దాణాపై అవగాహన కల్పించారు. సూక్ష్మదర్శిని వినియోగించి వ్యాధి నిర్ధారణ చేయు పద్ధతులు, వివిధ టీకాలు పని చేయు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు వజ్రమ్మ, జానకి, హెచ్ఎం శ్రీశైలం, పశు వైద్య సిబ్బంది రామ్మూర్తి, రమణ, శివ, తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఎంపిఇఒల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అనంతపురం

ఎంపిఇఒలకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అనంతపురంలో జరిగిన ఉద్యాన శాఖ సమ్మేళనంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపిఇఒలు ప్రభుత్వానికి, రైతులకు మధ్య వారధిగా పని చేస్తున్నారన్నారు. వ్యవసాయ పథకాలు రైతులకు అందించడంలో పదేళ్లుగా ముఖ్యపాత్ర పోషిస్తున్నారన్నారు. వారికి నేటికీ సమాన పనికి సమాన వేతనం అందకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపిఇఒల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రెడ్డి ప్రసాద్, జిల్లా అధ్యక్షు లు పి.భాస్కర్‌నాయక్, కె.వికాస్‌కుమార్‌రెడ్డి, కె.భాగ్యలక్ష్మి, పి.తిరుపతియ్య, డి.నాగరాజు, ఎంపిఇఒలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బెళుగుప్ప

స్థానిక ఆసుపత్రి సమీపంలో గత ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ శివ తెలిపారు. వివరాలు.. కళ్యాణదుర్గం మండలంలోని హులికల్లు గ్రామానికి చెందిన నాగమ్మ ఆమె కుమారుడు నాగరాజు(40) గత ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై బెళుగుప్ప ఆసుపత్రి సమీపంలో అదుపుతప్పి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన నాగరాజు అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం : బీసీ కార్పొరేషన్ మంజూరు చేసే రాయితీ రుణాల కోసం ఈ నెల 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ దివాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉరవకొండలో చోరీ

ఉరవకొండ : పట్టణంలో మంగళవారం రాత్రి ఓ సిలిండర్, సైకిల్ చోరీకి గురైనట్లు బాధితుడు ఎం.రామాంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రామాంజనేయులు మంగళవారం రాత్రి భోజనం చేసిన తర్వాత నిద్రించిన సమయంలో ఇంటి ఆవరణలో ఉంచిన గ్యాస్ సిలిండర్‌తో రేంజర్ సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

అనంత బాలోత్సవానికి విరాళం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15, 16వ తేదీల్లో ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న పిల్లల పండుగ అనంత బాలోత్సవానికి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయల సంఘం అధ్యక్షులు గోవిందరెడ్డి రూ.5,116, డి.అనురాధ రూ.5 వేల నగదును అందజేశారు. బుధవారం అనంత బాలోత్సవ కమిటి కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, సభ్యులు ఎస్‌వివి.రమణయ్యను కలిసి నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంత బాలోత్సవ కమిటీ సభ్యులు సరళ, పిఎస్‌హెచ్ఎం గౌరవాధ్యక్షులు లక్ష్మీనారాయణ, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న ఉపాధ్యాయులు